క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఏపీవో రవి

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో రవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో రెండుపూటలా సమయపాలన పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. సరైన కొలతలతో పనులు చేస్తే పూర్తిస్థాయి వేతనం వస్తుందన్నారు. ఎస్ఎంఎంఎస్ యాప్ ద్వారా వేతనదారుల హాజరు రెండుపూటలా నమోదు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌మణీశ్వరి

కొత్తూరు: గ్రామాలను నాటుసారా రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కిరణ్‌మణీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం-2.0 కార్యక్రమాన్ని ఎంపీడీవో నీరజ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లో సాటుసారా విక్రయాలు, అమ్మకాలు, రవాణా జరగకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పనుల ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో మన్మథరావు

పొందూరు: ఉపాధి నిధులతో ప్రతీ గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, వీవోఏలకు ఎంపీడీవో మన్మథరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనుల ప్రగతిపై సమీక్ష శుక్రవారం నిర్వహించారు. ఈ పనులకు జాబుకార్డు కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అందరూ అర్హులేనని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా సూర్యం



పాతపట్నం: పాతపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గేదెల సూర్యం ఎన్నికయ్యారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. దీనిలో ఉపాధ్యక్షుడిగా ఎస్.రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా వద్దాది తిరుపతిరావు, జనరల్ సెక్రటరీగా మద్దిలి రమణ, జాయింట్ సెక్రటరీగా లుకలాపు యుగంధర్, స్పోర్ట్స్ సెక్రటరీగా సీహెచ్ రామకృష్ణ, కోశాధికారిగా పద్దాన అప్పలనాయుడు, లైబ్రేరియన్‌గా బి.వి.నాయుడుతో పాటు ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా



అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ చేస్తూ ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. అధికారుల కళ్లుగప్పి మెళియాపుట్టి మండల కేంద్రంలోని వీధుల్లో నుంచి మిట్ట మధ్యాహ్నం ఇసుక తరలించడం ప్రారంభించారు. ట్రాక్టర్లకు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించడమే కాకుండా, కనీసం టార్పాలిన్లు కూడా కప్పడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ వి.దాలినాయుడు అన్నారు. మండలంలోని యారబాడు, లింగాలపాడు, కొటారపల్లి గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు శుక్రవారం వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యార్థులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

వేసవి దుక్కులతో పంటకు మేలు



వేసవి దుక్కులు చేస్తున్న రైతు



వేసవి దుక్కులు చేసిన పొలం

- సారవంతంగా మారనున్న భూమి
- చీడ, పీడలు నశించే అవకాశం

హిరమండలం: వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. చాలా మంది రబీ పూర్తవ్వగానే భూమిని అలా వదిలేసి, మరలా తొలకరి పలకరించినప్పుడు వానాకాలం సాగుకు సిద్ధమవుతుంటారు. చినుకులు కురవగానే దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలో దుక్కులు చేయడం వలన ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. వేసవి దుక్కులు వలన ఎండ భూమికి బాగా తగిలి చీడపీడలు నశించే అవకాశం ఉంటుంది. దీంతో పంట వేసే సమయంలో క్రిమికీటకాల బెడద తగ్గుతుంది. ఫలితంగా రసాయనిక ఎరువుల వినియోగాన్ని అరికట్టవచ్చు.

ఇలా చేయాలి..

- వర్షాకాలానికి ముందే భూమిని మూడు దుక్కులు దున్నాలి. ఇలా చేస్తే తొలకరి వర్షాలకు నేల మెత్తబడి భూమిలోకి నీళ్లు ఇంకుతాయి.
- దుక్కులు లోతుగా, అడ్డంగా, వాలుగా దున్నుకుంటే వర్షపునీరు భూమిలోకి సక్రమంగా ఇంకి తేమను నిల్వచేసే సామర్థ్యం పెరుగుతుంది.
- దుక్కిదున్ని భూమిని ఎండబెడితే కలుపు మొక్కలు నివారించవచ్చు.
- దుక్కులు చేసేముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి.
- వేసవిలో దుక్కిదున్నితే భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా, తేమలో జీవించే వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార పరిరక్షకు ఉపయోగపడతాయి.
- లోతు దుక్కులు చేయడం వలన వరిలో కాండం తొలచు పురుగు, రెప్పవాల్చు పురుగు, లద్దె పురుగు, పత్తిలో లద్దె పురుగులు, శనగపచ్చ పురుగులు, మిరపలో కాయతొలచు పురుగులు నశిస్తాయి.
- ప్రధానంగా ఎండాకాలంలో దుక్కులతో భూమి లక్షణాలు మారి, తొలకరి వర్షాలు పడినప్పుడు విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది.
- వేసవి దుక్కులు వలన భూమి పొరల్లోని కీటకాల గుడ్లు, శిలింద్రాలు బయటపడి ఎండవేడిమికి చనిపోతాయి. భూమికి హాని కలిగించే పురుగులు బయటకు వస్తే వాటిని పక్షులు తినివేస్తాయి. ఫలితంగా చీడపీడల సమస్య తగ్గుతుంది.
- పొలంలో చెత్తాచెదారం ఉంటే లోతుగా దున్నడంతో భూమిలో కలిసి కుళ్లిపోతుంది. ఫలితంగా సేంద్రియ ఎరువుగా మారి భూమికి బలాన్నిస్తాయి.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయట పడి కీటకాలు నశిస్తాయి. దీంతో పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం ఉండదు. పంటల కోత తర్వాత అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. నీరు సక్రమంగా భూమిలో ఇంకిపోవడంతో సారవంతంగా ఉంటుంది. ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి. రైతులు ఈ విషయాలు గమనించి వ్యవసాయం చేస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది.

– బి.సంధ్య, వ్యవసాయాధికారి, హిరమండలం

మరమ్మతులు చేయరూ..!



సరుబుజ్జిలి మండలంలోని పలు ఆర్అండ్‌బీ రహదారుల్లో రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రయాణాలు చేసేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అందువలన అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

సాగునీరు అందేదెలా..?



బూర్జ మండలంలోని గజిలిగెడ్డలో పూడికతీత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. బొమ్మిక రిజర్వాయర్ నుంచి నారాయణపురం వరకు విస్తరించి ఉన్న గజిలిగెడ్డలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో శివారు గ్రామాలకు సాగునీరు అందడం లేదని మదనాపురం, బూర్జ, నీలంపేట, నారాయణపురం తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు. అందువలన అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

- బూర్జ

చలివేంద్రం ఏర్పాటు



నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా మండళ్లు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట

భూముల రీసర్వేకు సహకరించాలి

- టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



మాట్లాడుతున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

కొత్తూరు: భూముల రీసర్వే చేస్తున్న సిబ్బందికి రైతులు సహకరించాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి కోరారు. కొత్తూరులో సర్పంచ్ పడాల కృష్ణవేణి అధ్యక్షతన భూముల రీసర్వేపై గ్రామసభను ఇన్‌చార్జి డీటీ నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రీసర్వే సమయంలో ఆయా భూముల యజమానులను పిలిచి వారి సమక్షంలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలన్నారు. రీసర్వేలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే సమయంలో భూమి యజమానులు తమ హక్కు పత్రాలను సర్వే బృందానికి చూపించాలన్నారు. మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో బర్రిపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు అక్రమంగా ఇళ్ల స్థలాలు పొందినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కాలనీలో సర్వేకు ఆదేశించినట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీపీ ఎల్.తులసీవరప్రసాదరావు, ఆర్ఎస్‌డీటీ భీమారావు తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగాల కమిటీలు నియామకం

జలుమూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జలుమూరు మండల యువజన విభాగం కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. యువజన విభాగ అధ్యక్షుడిగా జుత్త నేతాజీ, ఉపాధ్యక్షులుగా కల్యాణం శ్రీనివాసరావు, కూన వెంకటరమణ, ప్రధాన కార్యదర్శులుగా సేపాన వేణు, బాడాన త్రినాథరావు, దువ్వవలస త్రినాథరావు, కార్యదర్శులుగా కరణ బాల కృష్ణ, రావాడ హిమవంత్, కొర్ను వరహా నరసింహనాయుడు, వెలమల దొరబాబు, చింతు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వలెమల గౌరీ, దండుపాటి సురేష్, ధర్మాన రాంబాబు, పంగ పాపారావు, గురువు శ్రీనివాసరావు, యారబాటి బాల సాయి, బడిగింటి సంజీవ్‌లు నియామకమయ్యారు.

పోలాకి: వైఎస్సార్‌సీపీ పోలాకి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా రెంటికోట త్రినాథరావు, ఉపాధ్యక్షులుగా పాలిన రమణ, బమ్మిడి రాజు, జనరల్ సెక్రటరీలుగా గొలివి కృష్ణ, తలగాన మన్మథరావు, దుప్పట్ల రమేష్, సెక్రటరీలుగా గురివెల్లి చిరంజీవి, కొర్లాన చిన్నరాములు, చింతాడ సత్యం, చితపాన లక్ష్మీనారాయణ, చిట్టి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొమర పోలిదాస్, చౌదరి శ్రీను, గొల్లంగి నర్సింగరావు, పూడి అప్పలనాయుడు, నీలాపు గురువురెడ్డి, ముద్దాడ శ్రీనివాసరావు, పల్లి శ్రీనివాసరావులు నియామకమయ్యారు.

సారవకోట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారవకోట మండల యూత్ కమిటీ అధ్యక్షుడిగా కొండాల బాబూరావు, ఉపాధ్యక్షులుగా రెడ్డి తులసి, కొండాల శ్యామలరావు, జనరల్ సెక్రటరీలుగా వరుదు సత్యనారాయణ, గెల్లంకి అనిల్ కుమార్, దుంగ గోపి, సెక్రటరీలుగా మెండ వెంకటరమణ, పల్ల రవికుమార్, యాళ్ల వెంకటరావు, మామిడి కోటేశ్వరరావు, కూన బీమారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జరగడ్డ శ్రీనివాసరావు, జన్ని డిల్లేశ్వరరావు, సత్తారు రవికుమార్, కంచి శంకరరావు, ముంజు సుధాకర్, కొల్లి శ్యామసుందర్‌లు నియామకమయ్యారు.

నరసన్నపేట...

నరసన్నపేట మండల యూత్ వింగ్ కమిటీ అధ్యక్షుడిగా బుద్దల రాజశేఖరరావు, ఉపాధ్యక్షులుగా తోట భార్గవ, బగ్గు సతీష్ కుమార్, జనరల్ సెక్రటరీలుగా తంగుడు అరుణ దీప్, మార్పు శేఖర్, యారబాటి కన్నబాబు, సెక్రటరీలుగా మద్దు అమ్మన్నాయుడు, గెల్లంగి మహేష్, పొట్నూరు పృథ్వీ, చింతల అసిరినాయుడు, గొంటి గణపతిరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చల్ల తాతారావు, దంత చరణ్ కుమార్, నడితోక భార్గవి, సడగాన రాజు, ముద్ద భాస్కర్, తంగి అయ్యన్న, అలిగి గణేష్, కోన ధనరాజ్‌లు నియామకమయ్యారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

సారవకోట: మండలంలోని బద్రి గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్‌పీవో గోపీబాల శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నిర్మాణాలు పూర్తయిన కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఉపాధి పనులు పరిశీలించి వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపీడీవో మోహన్ కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, పంచాయితీ కార్యదర్శి మురళీ ఉన్నారు.

పరామర్శ



మెళియాపుట్టి: రంగారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రెడ్డి శాంతి



జలుమూరు: కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కృష్ణదాస్

జలుమూరు: మండలంలోని కరవంజ గ్రామానికి చెందిన విద్యుత్ ఉద్యోగి సంపతిరావు రవి కిరణ్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, దామ మన్మథరావు, జుత్తు నేతాజీ, చింతు శ్రీను తదితరులు ఉన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని జలకలింగుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలాకీ రంగారావు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని తెలియజేశారు. ఆమెతో పాటు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, మండల నాయకులు బైపోతు ఉదయ్ కుమార్, సక్క బాబూరావు, పరపటి యోగీశ్వరరావు, ఓం శంకర్, మాడుగుల మణి, ఉలాస రవి తదితరులు ఉన్నారు.

పాతపట్నం: మండలంలోని పలువురి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. పెద్దలోగిడి గ్రామంలోని దువ్వారి కాళీదాసు కుటుంబానికి చెందిన దువ్వారి మీనమ్మ, దువ్వారి లక్ష్మీపతి, ఉగ్రీపల్లి భాస్కరరావులు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. దీంతో వారికి సంతాపం తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన బైపోతు అప్పలరాజు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఎంపీటీసీ దువ్వారి జోగారావు, సర్పంచ్ దకర చిన్నారావు, పార్టీ నాయకులు పనుకు మోహన్, టంకాల సుధాకర్, జలమాల హరి తదితరులు ఉన్నారు.

రెడ్డి శాంతికి అభినందనలు



రెడ్డి శాంతికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నియమించారు. దీంతో ఆమెను కొత్తూరు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాతపట్నం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో కొత్తూరు మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణారావు, అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు అంపిలి బుచ్చిబాబు, పార్టీ నాయకులు తులసీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

పాతపట్నం: పాతపట్నం ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 6వ తేదీన నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరలా ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నామని వెల్లడించారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎల్.ఎన్.పేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంకే మిశ్రో పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జనపనారతో తయారు చేసిన సంచులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ దూరంగా ఉండాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం గ్రామ పంచాయతీ పరిధి జీడితోటల్లో పేకాట ఆడుతూ పట్టుబడిన 6 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.హైమావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.2,090ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

విద్యతోనే సమాజ వికాసం



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటరమణ

ఆమదాలవలస: విద్యతోనే సమాజ వికాసం సాధ్యమని జిల్లా సాక్షర భారత్ (వయోజన విద్య) డిప్యూటీ డైరెక్టర్ ముద్దాడ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని అరుణోదయ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీలో ఇండియా లెటర్స్ ట్రస్ట్ చెన్నై ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి వయోజన విద్యా కేంద్రాలు, యానిమేటర్ ఓరియంటేషన్, మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్య ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. విద్యతో ఆర్థిక పురోగతి సాధించడంతో పాటు చెడు వ్యసనాల నుంచి బయటపడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ తాళబత్తుల ధనుంజయరావు, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.రాములు, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శామ్యూల్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- సూపర్ సిక్స్ పేరుతో మోసం చేశారు
- ధ్వజమెత్తిన చింతాడ రవికుమార్
- పొందూరులో విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

పొందూరు: ప్రస్తుతం కూటమి పాలనలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ధ్వజమెత్తారు. స్థానిక పట్టుశాలి కల్యాణ మండపంలో మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సామాన్య కార్యకర్త నుంచి సమన్వయకర్త వరకు అందరూ సమానమేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ అనే బూటకపు హామీలనిచ్చి ప్రజలను కూటమి నాయకులు మోసం చేశారని మండిపడ్డారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, ప్రతీ మహిళకు రూ.15 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి పీ-4 అంటూ మరో నాటకానికి శ్రీకారం చుట్టారన్నారు. సీఎం చంద్రబాబు తానా అంటే తందానా అంటూ బాకా ఊదుతూ పవన్‌కల్యాణ్ వత్తాసు పలుకుతున్నాడని దుయ్యబట్టారు.

ఇసుకతో రోజుకి రూ.కోటి సంపాదన

ఆమదాలవలస నియోజకవర్గంలోని ఎమ్మెల్యే రోజుకు ఇసుకతో రూ.కోటి సంపాదిస్తున్నారని చింతాడ రవికుమార్ ఆరోపించారు. ఉద్యోగాలు తీయించడం, అక్రమ కేసులు బనాయించడం, అక్రమ మైనింగ్ నడపడం, గ్యాస్ గోడౌన్లు మూయించడం, సినిమా థియేటర్లు మూయించడమే లక్ష్యంగా అతను పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పూట గడపడం కోసం పనిచేస్తున్న చిరు ఉద్యోగాలు సుమారు 120 వరకు తీయించడం దారుణమన్నారు. చింతాడ రవికుమార్ స్థాయి ఏంటని తనను అంటున్నాడని, అయితే వాళ్ల మామ అనే వ్యక్తి లేకపోతే అతని స్థాయి ఏంటో అందరికీ తెలుసు అన్నారు. తానొక సామాన్యమైన వ్యక్తినని, పార్టీని, కార్యకర్తలను, జగన్‌మోహన్ రెడ్డిని నమ్ముకుని ప్రజల ముందుకు వెళ్తున్నానని తెలియజేశారు. భూదందాలు, ఇసుక దందాలు చేసే అర్హత తనకు లేదన్నారు. గ్రామాల్లో అరాచకాలు చేసే టీడీపీ నాయకులకు వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. అధికారముందని దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, జెడ్పీటీసీలు లోలుగు కాంతారావు, సురవరపు నాగేశ్వరరావు, ఆమదాలవలస మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అజంత, జిల్లా మహిళా మాజీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి పద్మజ, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ ప్రసాదరావు, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వండాన సూరపునాయుడు, పప్పల రాధాకృష్ణ, గుడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలో మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీ(అడివి కొత్తూరు)లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.1.5 లక్షలతో నిర్మించిన భోజనశాలను నిర్మాణ దాత, సీనియర్ సివిల్ సర్వీస్ అధికారి అంధవరం విశ్వేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. సొంత గ్రామంలో తన తండ్రి మాజీ జెడ్పీటీసీ అంధవరం వెంకటరావు జ్ఞాపకార్థం సొంత నిధులతో భోజనశాల నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవోలు గోవిందరావు శ్రీనివాసరావు, ఎద్దు సుందరనారాయణ, వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసు నాయుడు, హెచ్ఎం జీవీ రమణ, సర్పంచ్ ధర్మారావు, రామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.